

ధర్మారం: నంది పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఉప్పొంగుతున్న కాళేశ్వరం జలాలు

# కాళేశ్వర జల పరవళ్లు

- లింక్-2లో గోదావరి పరుగులు
- నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లలో ఐదేసి మోటర్ల రన్
- ఏకకాలంలో 15,750 క్యూసెక్కుల పంపింగ్
- సోమవారం సాయంత్రానికే మధ్యమానేరుకు రెండున్నర టీఎంసీలు సరఫరా

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, జూలై 29 : కాళేశ్వర గంగ ఉప్పొంగుతున్నది. లింక్-2లో ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు జలాశయానికి పరుగులు తీస్తున్నది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంప్‌హౌస్‌లో ఆదివారం వరకు నాలుగు మోటర్ల ద్వారా ఎత్తిపోతలు కొనసాగించిన అధికారులు, సోమవారం మరో మోటర్‌ను ఆన్ చేశారు. ప్రస్తుతం 2,3,5,6,7 పంపులు నడుస్తున్నాయి. ఒక్కో మోటర్ ద్వారా 3,150 చొప్పున 15,750 క్యూసెక్కులు డెలివరి సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడి నంది రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. అక్కడ రిజర్వాయర్ గేట్లను ఎత్తడంతో అంతే మొత్తంలో జలాలు అండర్ టన్నెళ్లలో గ్రావిటీ ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. అక్కడ సైతం నిన్నామొన్నటిదాక నాలుగు బాహుబలి మోటర్ల ద్వారా ఎత్తిపోతలు కొనసాగించిన అధికారులు, సోమవారం ఐదో మోటర్‌ను ఆన్ చేశారు. మొత్తంగా 15,750 క్యూసెక్కులు లిఫ్ట్ చేస్తుండగా, డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడ్డ జలాలు సుమారు 5.7 కిలో మీటర్లు ఉన్న గ్రావిటీ కాలువ ద్వారా వరదకాలువకు చేరుకొని అక్కడి నుంచి మధ్యమానేరుకు పరుగెడుతున్నాయి. సోమవారం సాయంత్రానికి రెండున్నర టీఎంసీల జలాలను మధ్యమానేరుకు తరలించినట్టు ప్రాజెక్టు అధికారి రాంప్రదీప్ తెలిపారు. ఇన్‌ఫ్లోను బట్టి అవుట్‌ఫ్లో కొనసాగుతుందని వివరించారు. మధ్యమానేరు పూర్తి నీటి సామర్థ్యం 27.054 టీఎంసీలుకాగా, ప్రస్తుతం 7.491 టీఎంసీలకు చేరుకుంది. ఎత్తి పోతల ద్వారా పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతున్న నేపథ్యంలో మధ్యమానేరులో నీటి మట్టం గంట గంటకూ పెరుగుతోంది.



బోయినపల్లి: వరద కాలువ ద్వారా ఎస్సారార్ జలాశయానికి తరలుతున్న కాళేశ్వరం జలాలు



రామడుగు: గాయత్రీ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఎగిసిపడుతున్న కాళేశ్వరం జలాలు

# చీమలపేటకు దారేది?

పది రోజులుగా పడుతున్న వర్షాల కారణంగా జూలపల్లి మండలం చీమలపేటకు ఇతర గ్రామాలకు మధ్య సంబంధాలు తెగిపోయాయి. వరద తెచ్చిన ముప్పుతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు వెళ్లే నాలాలు మూసుకుపోవడంతో గ్రామం మధ్యలో ఉన్న తారురోడ్డుపై దాదాపు రెండున్నర ఫీట్ల దాకా వరద చేరింది. దీంతో బ్యాక్ వాటర్‌తో తన రెండెకరాల వరి పంట నీట మునిగిందని, రోడ్డుపై నిలిచిన వరద నీరు తొలగించాలని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని, అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదని తొంటి బీరయ్య అనే రైతు వాపోయాడు. మరోవైపు తారు రోడ్డును ఆనుకుని ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని నివాస గృహాల్లోకి వరద నీరు చేరడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వరద నీటిని తొలగించడానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

**- జూలపల్లి, జూలై 29**



చీమలపేటలో రోడ్డుపై చేరిన వరద నీరు

# అత్తింటోళ్లకు పదేళ్ల జైలు

కోడలు హత్య కేసులో శిక్ష

ఓదెల, జూలై 29: ఓదెల మండలం కొలనూర్‌లో అదనపు కట్నం కోసం కిరోసిన్ పోసి నిప్పంటించి కోడలిని హత్య చేసిన కేసులో అత్తింటి వారికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ పెద్దపల్లి జిల్లా, సెషన్స్ జడ్జి డాక్టర్ హేమంత్‌కుమార్ తీర్పు వెలువరించినట్టు రామగుండం పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు వివరాల ప్రకారం.. కొలనూర్‌కు చెందిన వీర్ల రవీందర్‌కు కరీంనగర్ నగర పరిధిలోని అల్గునూర్‌కు చెందిన యాటా లావణ్యతో 2013లో వివాహం జరిగింది. ఆ సమయంలో ₹10 లక్షలు, 10 తులాల బంగారంతోపాటు ఇతర లాంఛనాలతో పెండ్లి జరిపించారు. ఆ తర్వాత మూడు నెలల నుంచి అదనంగా మరో ₹5 లక్షలు తీసుకురావాలని వేధింపులకు పాల్పడ్డారు. పలుసార్లు పంచాయితీలు జరగగా మహిళా పోలీస్ స్టేషన్‌లో కూడా కౌన్సిలింగ్ జరిగింది. అయినా అత్తింటి వారు తీరు మార్చుకోక కట్నం కోసం వేధింపులకు పాల్పడుతూ 2014 సెప్టెంబర్ 25న లావణ్యపై కిరోసిన్ పోసి నిప్పంటించారు. వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకువెళ్లి చికిత్స చేయిస్తుండగా అదే నెల 28న మృతి చెందింది. అందులో భర్త వీర్ల రవీందర్, బావ కుమారస్వామి, తోటి కోడలు భారతి, అత్త రాజమ్మ, మామ కొమురయ్యపై నేరం రుజువైంది. దీంతో పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి ₹6 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పును వెలువరించారు. కేసు విచారణలో సహకరించిన డీసీపీ చేతన, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి, కోర్ట్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను రామగుండం సీపీ శ్రీనివాస్ అభినందించారు.

# కిడ్నీ మార్పించలేదని..

- భార్యను చంపి భర్త ఆత్మహత్య

సిరిసిల్ల టౌన్, జూలై 29 : తనకు కిడ్నీ మార్పించలేదని ఓ భర్త క్షణికావేశానికి లోనయ్యాడు. భార్యను హత్య చేసి తర్వాత తాను ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన దూస రాజేశం(62), లక్ష్మి(54) దంపతులకు ఇద్దరు, ఒక కూతురు ఉన్నారు. రాజేశం కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనకు సిరిసిల్లలోని ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ చికిత్స చేయిస్తున్నారు. తనకు కిడ్నీ మార్పిడి చేయించాలని రాజేశం చాలా రోజులుగా కుటుంబ సభ్యులతో గొడవపడుతున్నాడు. డోనర్ దొరకగానే మార్పిడి చేపిస్తామని నచ్చజెబుతూ డయాలసిస్ చేయిస్తున్నారు. అయితే మెరుగైన వైద్యం చేయించడం లేదన్న ఆగ్రహంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజేశం తన భార్య లక్ష్మి తలపై గాయపరిచాడు. ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, తర్వాత ఆయన కూడా ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దూస రాజేశం, లక్ష్మి (ఫైల్)

# పైల్స్‌కు అత్యాధునిక లేజర్ చికిత్స

- నాటువైద్యంతో ఆరోగ్యం పాడు చేసుకోవద్దు
- ప్రముఖ ల్యాప్రోస్కోపిక్ అండ్ లేజర్ డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్ కుమార్
- కొలొరెక్టల్ కాన్ఫరెన్స్‌కు 400 మంది సర్జన్లు హాజరు



కొలొరెక్టల్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్లు రవీందర్‌రావు, చిట్టుమల్ల ప్రదీప్ కుమార్

కరీంనగర్ విద్యానగర్, జూలై 29 : పైల్స్, ఫిషర్ ఫిస్టులా వంటి జబ్బులతో బాధపడుతున్న రోగులు నాటు వైద్యాన్ని నమ్మి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని ప్రముఖ ల్యాప్రోస్కోపిక్ అండ్ లేజర్ డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్ కుమార్ సూచించారు. పైల్స్, ఫిషర్ ఫిస్టులా జబ్బులకు అత్యాధునిక లేజర్ స్టాప్లర్ వంటి ఇన్వాసిస్ పద్ధతుల ద్వారా నొప్పి లేకుండా ఆపరేషన్ చేసి, ఒక రోజులోనే డిశ్చార్జ్ చేయవచ్చని చెప్పారు. రెండు రోజులుగా నగరంలోని మైత్రి కన్వెన్షన్‌లో జరుగుతున్న సౌతిండియా రీజనల్ కొలొరెక్టల్ కాన్ఫరెన్స్-2024లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా దేశ నలుమూలల నుంచి వచ్చిన ప్రముఖ కొలొరెక్టల్ నిపుణులు వివిధ అంశాల గురించి వివరించారు. వివిధ శస్త్ర చికిత్సలు చేయడం నేర్పించారు అలాగే, లైఫ్ లైన్ హాస్పిటల్ ఆపరేషన్ థియేటర్ నుంచి వివిధ రకాల ఆపరేషన్లను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన దాదాపు 100 మంది సీనియర్ కొలొరెక్టల్ నిపుణులు, 400 మంది సర్జన్‌లు, ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ రవీందర్‌రావు, సెక్రటరీ డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్ కుమార్, కోశాధికారి డాక్టర్ అరుణ్ కఠారి, ఐఎస్‌సీపీ కార్యదర్శి డాక్టర్ లడ్డుకర్, కోశాధికారి డాక్టర్ శాంతి వర్ధిని, డాక్టర్ గంగ శంకర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రశాంత్, చల్మెడ వైద్య కళాశాల డైరెక్టర్ వీ సూర్యనారాయణరెడ్డి, టీజీఎంసీ సభ్యులు డాక్టర్ రాజకుమార్, డాక్టర్ నరేశ్ పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ

# జగిత్యాల

5 | కరీంనగర్, మంగళవారం 30 జూలై 2024 | JAGTIAL


# ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నమస్తే ఎఫెక్ట్

మల్లాపూర్, జూలై 29 : మల్లాపూర్ మండలంలోని గొర్రెపల్లిలో రైతులు పడుతున్న కరెంట్ కష్టాలపై 'ఒక్క నెలలోనే రెండు సార్లు కాలిపాయె' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో సోమవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. సోమవారం విద్యుత్‌శాఖ ఏఈ వినీత్‌రెడ్డి సిబ్బందితో కలిసి కాలిపోయిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, మరో నాణ్యమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. స్వయంగా ఏఈ వినీత్‌రెడ్డి దగ్గరుండి సమస్యను పరిష్కరించడంతో రైతులు 'నమస్తే తెలంగాణ'కు ధన్యవాదాలు తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్ పనులను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఏఈ వినీత్‌రెడ్డి

నాలుగు నెలల చిన్నారి

# అరుదైన రికార్డు

- 347 ఫ్లాష్ కార్డుల గుర్తింపు
- నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

కోరుట్ల, జూలై 29: నాలుగు నెలల బాలుడు అరుదైన గుర్తింపు సొంతం చేసుకున్నాడు. 347 ఫ్లాష్ కార్డుల (పక్షులు, జంతువులు, కలర్స్, వివిధ దేశాల ఫ్లాగ్స్)ను అలవోకగా గుర్తుపట్టేస్తూ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన డాక్టర్ కార్తికేయన్ రాజు - స్రవంతి దంపతుల కొడుకు హన్విద్ కృష్ణ (నాలుగు నెలలు) 347 ఫ్లాష్ కార్డులను గుర్తు పడుతుండడంతో యంగెస్ట్ టూ ఐడెంటిటీ విభాగంలో నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు దరఖాస్తు చేశారు. జూలైలో 347 ఫ్లాష్ కార్డుల ఐడెంటీ వీడియోలను పరిశీలించిన నోబెల్ సంస్థ ప్రతినిధులు చిన్నారికి అవార్డును కేటాయించినట్టు తెలిపారు. చిన్న వయసులో తమ మనుమడు ఘనత సాధించడంపై కోరుట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న శ్రీదేవి, భాస్కర్ రాజు దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.



నోబెల్ అవార్డుతో తల్లి స్రవంతి, హన్విద్ కృష్ణ




# వ్యాధుల కాలం.. జాగ్రత్త!

విద్యానగర్ జులై 29.. ఎడతెరిపిలేని వర్షాలతో పరిసరాల్లో పరిశుభ్రత లోపించడం, తాగునీరు కలుషితం కావడం వల్ల వివిధ రకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉన్నది. సీజనల్ వ్యాధుల విషయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులు సూచిస్తున్నారు. అందులో భాగంగా అన్ని పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే అమలు చేయాలని స్పష్టం చేస్తున్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రైనేజీల శుభ్రత, దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని ఎప్పటికప్పుడు సిబ్బందిని ఆదేశిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ డెంగ్యూ కేసులు పదుల సంఖ్యలో వస్తుండడంతో యాంటీ లార్వా కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేసింది. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులకు ఆదిలోనే అడ్డుకట్టు వేసేందుకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించింది. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించి, జ్వరం, జలుబు, తలనొప్పి, తదితర లక్షణాలు ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నారు. వీటినిబట్టి నేరుగా ఇంటి వద్దే ఉచితంగా మందులు అందిస్తున్నారు. జ్వరం, జలుబు, తలనొప్పి లక్షణాలు మూడు నాలుగు రోజులైనా తగ్గకపోతే రక్త నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిస్తున్నారు. డెంగ్యూ మలేరియా నిర్ధారణ అయితే ప్లేట్లెట్స్ తగ్గకుండా ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. డెంగ్యూ కేసులు నమోదైతే పరిసర ప్రాంతాల్లోని ఇండ్లల్లో ప్రత్యేక సర్వే చేపట్టి రక్త నమూనాలను సేకరించి అవసరమైన చికిత్స అందిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు ఇస్తున్నారు.



## ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

వర్షాల వల్ల నీటి కాలుష్యం పెరుగుతుండడంతోపాటు కొన్నిచోట్ల డ్రైనేజీ నీరు తాగునీటి పైపుల్లోకి చేరుతోంది. ఇవి తాగితే డయేరియా, కామెర్లు వచ్చే ప్రమాదం ఉన్నది. దీని నివారణకు కాచి, చల్లార్చిన నీటిని తీసుకోవాలి. నిల్వ ఉన్న వర్షపు నీరు, మురుగునీటితో దోమలు వ్యాప్తి చెందుతాయి. వీటి నివారణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. తినే ముందు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. వేడి వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. ఆహార పదార్థాలపై మూతలు సరిగ్గా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. పిల్లల్లో జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
































